జయహో సీఎం జగనన్న



75 కేజీల కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, తదితరులు



ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు చెబుతున్న వృద్ధురాలు

- 75వ రోజు కోలాహలంగా గడపగడపకు మన ప్రభుత్వం
- జనంతో మమేకమైన ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: జయహో జగనన్న అంటూ ప్రజలు, మహిళలు, యువత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు నినదించారు. కేరళ సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, పూల వర్షం మధ్య మంగళవారం 75వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏలూరు 11వ డివిజన్ 48వ సచివాలయం పరిధిలో కోలాహలంగా సాగింది. భారీ జనసందోహంతో కలిసి ఎమ్మెల్యే ఆళ్ల నాని పోణంగి రోడ్డు చిరంజీవి బస్టాండ్ నుంచి పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గడపగడపకు కార్యక్రమం 75 రోజులు పూర్తయిన సందర్భంగా 75 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేశారు. 75 మంది లబ్ధిదారులు తమ ఇళ్లలో కేక్‌లు కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పేదల పాలిట దేవుడు జగన్

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ లక్షణాలను పుణికిపుచ్చుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని గొప్ప సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల పాలిటి దేవుడుగా మారారని చెప్పారు. కరోనా వైరస్ వణికించిన కాలంలోనూ ఏపీలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి కష్టం లేకుండా రాజులా కాపాడుకున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయని చంద్రబాబు నేడు జనాల్ని మభ్యపెట్టటానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, మంచెం మైబాబు, కురెళ్ల రామ్‌ప్రసాద్, బత్తిన మస్తాన్ రాజు, ఏఎంసీ డైరెక్టర్ కోరాడ బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మహ్మద్ ఆరీఫ్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, దేవరకొండ శ్రీనివాస్, ఇనపనూరి కేదారేశ్వరి, కలవకొల్లు సాంబ, యర్రంశెట్టి సుమన్, జయకర్, తంగెళ్ల రాము, కత్తిరి రామ్మోహనరావు, లీగల్‌సెల్ రామాంజనేయులు, ప్రత్తిపాటి తంబి, నాయకులు బండారు కిరణ్, పాలిమేర హరికృష్ణ, మోటమర్రి సదానందం, నిడికొండ నరేంద్ర, వైఎస్‌వీ శివరావు, నున్న కిషోర్, జిజ్జువరపు రమేష్, పారిపిరెడ్డి నాగేశ్వరరావు, లూటుకుర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



ఆర్‌ఆర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తున్న టూటౌన్ సీఐ చంద్రశేఖర్, సిబ్బంది

ఏలూరు టౌన్: నిబంధనలు పాటించాలని, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపటం నేరమని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ అన్నారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని ఆర్‌ఆర్‌పేట శ్రీనివాస థియేటర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన ఎస్సై ప్రసాద్, సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర పత్రాలన్నీ వెంట తెచ్చుకోవాలని సీఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, అధిక వేగంతో ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పిల్లలను స్కూల్‌కి పంపండి



బాలికల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): పిల్లలను తప్పనిసరిగా స్కూలుకు పంపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి కోరారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక కబాడీగూడెం, పాముల దిబ్బ పరిసర ప్రాంతాల్లో బడికి వెళ్లని పిల్లల గురించి ఆరా తీశారు. స్థానికంగా తిరుగుతున్న బాలలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పనిసరిగా స్కూలుకు పంపాలని లేని పక్షంలో హోంకి తరలిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు పుచ్చల వెంకట్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పనులు చేయించొద్దు

ఏలూరు (టూటౌన్): ఆశ వర్కర్లతో వారికి సంబంధం లేని ఆన్‌లైన్ పనులు చేయించవద్దని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీఎం అండ్ హెచ్ఓ ఎం.నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఆశ వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి మద్దతు ప్రకటించారు.

నేడు తపాలా జీవిత బీమా ప్రత్యేక డ్రైవ్

ఏలూరు (టూటౌన్): తపాలా జీవిత బీమా 140వ వార్షికోత్సవాన్ని ఏలూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్ట్ ఆఫీసులలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మహ్మద్ ఆసిఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే లభించే తపాలా జీవిత బీమా పీఎల్ఐ ఇప్పుడు అన్ని రకాల డిగ్రీ లేదా డిప్లొమా పట్టభద్రులకు కూడా ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామీణ తపాలా జీవిత బీమా ఆర్‌పీఎల్ఐ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర బీమా సంస్థలతో పోలిస్తే తపాలా జీవిత బీమా తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌తో లభిస్తుందని వివరించారు. ప్రజలంతా తపాలా జీవిత బీమా పొందాలని ఆయన కోరారు.

హిందీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తూర్పువీధి నగరపాలక సంస్థ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరులో దశమందం విద్యా సేవా సదన్ సంస్థ నిర్వహించిన హిందీ ప్రతిభా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ హిందీ భాషా ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన ఎస్.గీతిక, జె.గోవర్ధన్, బి.షెర్లీ బంగారు, సీహెచ్ నాగలక్ష్మి, ఎం.కుసుమంత్, దినేష్, శ్రీధర్ రజత, రోషన్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ హరిబాబు, హిందీ ఉపాధ్యాయులు వి.ప్రిస్కిల్లా కుమారి, ఎన్.లక్ష్మీ రమ్య అభినందించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని వినతి



రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న బొల్లిన నిర్మల కిషోర్

భీమడోలు : ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలుపుదల చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు, రైల్వే పీఏసీ సభ్యురాలు బొల్లిన నిర్మల కిషోర్ ఢిల్లీలో రైల్వే బోర్డు సమావేశంలో బోర్డు చైర్మన్ కృష్ణదాస్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల భీమడోలు పర్యటనకు వచ్చేసిన నిర్మల కిషోర్‌కు భీమడోలు బీజేపీ మండల శాఖ భీమడోలులో రైళ్లు నిలుపుదల చేయాలని, బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో నిర్మల కిషోర్ బోర్డు చైర్మన్ కృష్ణదాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల కోసం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, ఇది ఇక్కడ ప్రజలు, భక్తుల చిరకాల వాంఛ అని ఆయనకు ఆమె వివరించారు. దీనిపై స్పందించిన కృష్ణదాస్ విజయవాడలోని రైల్వే డీఆర్ఎంకు ఫోన్ చేసి భీమడోలులో రైళ్లు నిలుపుదల చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు నిర్మల కిషోర్ చెప్పినట్లు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ విలేకరులకు తెలిపారు. మరికొన్ని రోజుల్లో భీమడోలులో రైళ్లు నిలుపుదల, రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌లను ఏర్పాటు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భీమడోలు రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు



భీమడోలులో ట్రాక్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

భీమడోలు : జాతీయ రహదారిని అనుకుని ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్‌కు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు అత్యవసర పనులు చేపడుతున్నారు. దీంతో రైల్వే గేటు మూసివేశారు. ట్రాక్‌పై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ఆ ట్రాక్ మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది ఎదురవుతున్న పరిస్థితి. ఈ సమస్యను రైల్వే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై సంబంధిత రైల్వే అధికారులు రెండోరోజు మంగళవారం ట్రాక్ మరమ్మతులు చేపట్టారు. ఈ ట్రాక్‌పై ప్రయాణించే భారీ వాహనాలు, ఇతర వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. పాతూరు, వడ్లపట్ల మీదుగా వివిధ ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు, భారీ వాహనాలు గమ్యాలకు చేరుకుంటున్నాయి. శుక్రవారం ఈ పనులు పూర్తవుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

నకిలీ నగలతో రుణం.. ముగ్గురు సిబ్బందిపై కేసు

ఏలూరు టౌన్: స్థానిక ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో నకిలీ బంగారు నగలు కుదువపెట్టి రుణం తీసుకున్న ముగ్గురు సిబ్బందిపై టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్‌ఆర్‌పేటలోని కాగుమట్టం ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ మేనేజర్ అవినాష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ తలిత, ఎగ్జిక్యూటివ్ శివకుమార్ కలిసి నకిలీ నగలు సంస్థలో కుదువపెట్టి కొంత కాలం క్రితం రూ.8 లక్షల 58 వేలు రుణం తీసుకున్నారు. ఆ నగలు నకిలీవని ఇటీవల బయటపడడంతో యాజమాన్యం కుమార్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సంచార పశు ఆరోగ్య సేవలు ప్రారంభం



వేలేరుపాడులో వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వేలేరుపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవల వాహనాన్ని వేలేరుపాడులో మంగళవారం ఎంపీపీ కెచ్చెల లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి ప్రారంభించారు. వాహనంలో హైడ్రాలిక్ రూమ్‌ను తహసీల్దార్ కె.చల్లన్నదొర ప్రారంభించారు. మండల కేంద్రంలో ట్రిల్ రన్ వేశారు. పోలవరం నియోజకవర్గంలోని జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల రైతులకు ఈ వాహనం ద్వారా సేవలు అందనున్నాయి. ఈ సందర్భంగా ఏడీఏ డాక్టర్ సాయిబుచ్చారావు మాట్లాడుతూ పోలవరం మండల కేంద్రంలో ఒక సంచార వాహనం, వేలేరుపాడు మండల కేంద్రంలో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఒక్కో వాహనానికి రూ.45 లక్షలు వెచ్చించిందని తెలిపారు. ఈ వాహనంలో వెటర్నరీ అసిస్టెంట్, ఒక వైద్యుడు ఉంటారని తెలిపారు. 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే, వెంటనే ఆ ప్రాంతానికి వచ్చి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసన్న, వీఎల్ఓ ఏవీవీ సత్యనారాయణ, జేవీఓ అమ్ములు, సిబ్బంది ఎస్.రాజు, అచ్యుత్‌రావు, భవానీ, వైస్ ఎంపీపీ మేడవరపు నాగశ్రీ, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, మండల వ్యవసాయశాఖ చైర్మన్ కామినేని వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాపై హర్షం



సాగు, తాగునీటిని నింపుతున్న నాయకులు

పెదపాడు: మండలంలోని కలపర్రు గ్రామంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు వత్రపు కోటిరెడ్డి తెలిపారు. మంచినీటి చెరువుకు, పంట పొలాలకు నీటి సరఫరా చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలపర్రు గ్రామంలో ఇటీవల రాజగోపాల స్వామి పంపింగ్ స్కీమ్ కింద 300 ఎకరాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువచ్చారు. చెరువుకు నీరు నింపడం కష్టతరంగా మారిందని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే మోటార్లు ద్వారా నీటిని నింపేందుకు చర్యలు చేపట్టారు. నీరు సరఫరా చేసే పనుల్లో నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రానికి ప్రత్యేక హదాకోసం పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం సీపీఐ (ఎంఎల్)న్యూడెమొక్రసీ స్థానిక కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లో రాష్ట్ర పార్లమెంట్, రాజ్యసభ సభ్యులు 2014లో పార్లమెంట్‌లో తీర్మానం చేసిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, 11 కేంద్రీయ విద్యాలయాలు, కడప ఉక్కు కర్మాగారం, రామయ్యపట్టణం ఎయిర్‌పోర్టు, గుంతకల్ రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీపై బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. అవసరమైతే పదవులకు రాజీనామాలు చేయాలన్నారు. విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రకు అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇవ్వడం ద్వారా కేంద్ర ప్రభుత్వ మోసాన్ని ఎండగట్టాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం, ఏఐవైఎఫ్ నాయకులు యు.హేమ శంకర్, రాజేష్, మహర్షి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలు





ప్రత్యేకాలంకరణలో అచ్చమ్మ పేరంటాలు తల్లి, అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వివిధరకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు జిల్లాల నుంచి విచ్చేసిన భక్తులు క్యూలో నిలబడి అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

భీమడోలులో హోటల్‌పై విజిలెన్స్ దాడులు

- అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్ల స్వాధీనం
- యజమానిపై కేసులు నమోదు



భీమడోలులో గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

భీమడోలు : భీమడోలు జంక్షన్‌లోని బృందావన హోటల్‌పై మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఆరు గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నారు. హోటల్ యజమానిపై రెండు కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై జి.కె.నాగరాజు, ఏజీ శ్రీధర్‌బాబు రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేశారు. హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆరు గ్యాస్ సిలిండర్లలో ఐదు హెచ్‌పీ, ఒకటి భారత్ గ్యాస్ సిలిండర్లు కాగా వాటి విలువ రూ.16,458 ఉంటుందని పేర్కొన్నారు. యజమాని సలాది వీరవెంకట సత్యనారాయణపై 6ఏ, 7 1) కేసులను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సిలిండర్లను స్వాధీనం చేసుకుని వాటిని సంబంధిత సీఎస్ డీటీకి అప్పగించారు. ఈ దాడుల్లో ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వోలు వెజ్జు వినయ్, జి.మార్కేండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతుపై దౌర్జన్యం.. కేసు నమోదు

పెదవేగి : కౌలు రైతుపై దౌర్జన్యం చేసి పంటను నాశనం చేసిన వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన వేగుంట దుర్గామల్లేశ్వరచౌదరి పెదవేగి మండలం జగన్నాథపురంలో చిలకపూడి సాంబశివరావుకు చెందిన 17.59 ఎకరాలకు కౌలు కు తీసుకుని మొక్కజొన్న, జామతోట సాగు చేస్తున్నారు. జనవరి 12న జగన్నాథపురం గ్రామానికి చెందిన వేగుంగ రవికుమార్, పాలడుగు భానుప్రకాష్, బలుసు వెంకటరాంబాబులు, వేగుంట దుర్గామల్లేశ్వరచౌదరిపై దౌర్జ న్యం చేసి మొక్కజొన్న పంటను నాశనం చేశారు. దీంతో బాధితుడు పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన



కూచింపూడి ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : పెదవేగి మండలం కూచింపూడి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పెదవేగి ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి తరగతి గదులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో అందిస్తున్నారో మెనూ ప్రకారం అందిస్తున్నారో లేదోనని పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దెందులూరు: మండలంలో గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి కోరారు. మండలంలో పోతునూరు గ్రామంలో ఓసీ-1, జోగన్నపాలెంలో ఎస్సీ-2, దెందులూరులో బీసీ-ఈ-1, ఎస్సీ, ఓసీ-2, ఎస్సీ, ఎస్సీ ఉమెన్, ఎస్టీ-3 గోపన్నపాలెం బీసీ-డీ రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నియామకం జరుగుతుందన్నారు. మొత్తం 10 వలంటీర్ల పోస్టులకు నియామక ప్రక్రియ జరుగుతుందని 18 సంవత్సరాలు కలిగి ఉండి 35 సంవత్సరాలు మించనివారు ఈ పోస్టుకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 6వ తేదిన స్క్రూట్నీ జరుగుతుందని, 7వ తేదిన కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఎన్నికైన వలంటీర్లకు 9వ తేదిన నియామక పత్రాలు అందించడం ఉంటుందని ఎంపీడీఓ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	30

ఘనంగా వెంకటేశ్వరస్వామి సప్తాహ మహోత్సవాలు

దెందులూరు: మండలంలోని వేంకటేశ్వరస్వామి సప్తాహ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి పంచార్లిక దీక్ష, కృతకల్యాణ మహోత్సవాలు, అష్టకలశ స్థాపన మహోత్సవం జరిగింది. అర్చకులు స్వామివారికి వివిధ పుష్పాల తో విశేషాలంకరణ చేశారు. కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొడాలి శ్రీనివాస్, అరుణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్చి 23 నుంచి పొగాకు కొనుగోళ్లు

కొయ్యలగూడెం : వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు మార్చి 23 నుంచి ప్రారంభిస్తున్నట్లు కేంద్రం వేలం నిర్వహణ అధి కారి గ్రేసీ మార్కెట్ మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు బోర్డు ఆక్షన్ మేనేజర్ డి.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. కొయ్యలగూడెంతో సహా ఎస్ఎల్ఎస్ పరిధిలోని మిగిలిన నాలుగు పొగాకు వేలం కేంద్రాలైన జంగారెడ్డిగూడెం-1, 2, దేవరపల్లి, గోపాలపురంలలో అదేరోజు కొనుగోళ్లు ప్రారంభం అవుతున్నాయన్నారు. కొయ్యలగూడెం వేలం కేంద్రం ద్వారా రైతులకు 10.5 మిలియన్ల కేజీల పొగాకు పంటకి అనుమతి ఇచ్చామన్నారు.

వైద్యానికి రూ.2 లక్షల సాయం



అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో వెంకటరాజు

జంగారెడ్డిగూడెం : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఫొటోగ్రాఫర్ అనిల్‌కుమార్ వైద్యానికి దాత నాటకశాల వెంకటరాజు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని బాధితుల ఖాతాకు జమ చేసినట్లు జంగారెడ్డిగూడెం ఫొటోగ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్ మిక్సింగ్ యూనిట్‌సభ్యులు తెలిపారు. అనిల్‌కుమార్ భార్య మాధిరిని, కుటుంబ సభ్యులను దాత వెంకటరాజు పరామర్శించి వైద్యం అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఆ కుటుంబ పోషణ నిమిత్తం నెలకు రూ.10 వేలు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. వెంకటరాజు దాతృత్వంపై ఫొటోగ్రాఫర్లు, బాధితుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బుట్టాయగూడెం : బుద్దులవారిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల వివరాలు ప్రకారం.. బుద్దులవారిగూడెంకు చెందిన పొట్ట దుర్గారావు స్కూటీపై వెళుతుండగా వాహనం ఢీకొని కింద పడిపోయాడు. దీంతో దుర్గారావు కుడికాలు విరిగింది. క్షతగాత్రుడ్ని బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.